


'గణపతి' బయటి కొచ్చి, ఓ సారి రోడ్డు మీదికి దృష్టి సారించాడు. అతడి భృకుటి ముడివడింది. నుదురు మీది చర్మం ముడతలు పడింది. ఆ వస్తున్నవాడిని నిర్ధారించుకోడానికి జేబులో వున్న కళ్ళజోడు తీసి కళ్ళకి పెట్టుకుని చూశాడు.

"సందేహం లేదు... చంటే" అనుకున్నాడు. "అప్పుడే వచ్చేస్తున్నాడేమిటి?" అనుమాన మొచ్చింది. వడి వడిగా వెళ్ళాడు. చంటి ఏడుస్తున్నాడు.

గణపతికి బాధ కలిగింది. మరి కొంచెం వేగంగా వెళ్ళి పుస్తకాల సంచీ తీసుకుని చంటిని ఎత్తుకున్నాడు.

చంటి చెంపల మీద కన్నీటి చారికలున్నాయి. ముక్కులోంచి చీమిడి కారుతోంది.

తండ్రిని చూసేసరికి చంటి బాధ మరీ ఎక్కువయింది.

"ఎందుకు నాన్నా ఏడుస్తున్నావు? ఏమైంది? ఎవరయినా కొట్టారా? ఎవరైనా ఏదైనా అన్నారా?" ప్రశ్నించాడు గణపతి.

ఇంకాస్త 'వాల్యూం' పెంచి ఏడవసాగాడు చంటి.

ప్రక్కనున్న షాపు దగ్గరకి తీస్కెళ్ళి, ఓ చాక్లెట్ కొనిచ్చాక శాంతించాడు చంటి.

అంతకు ముందు వేసిన ప్రశ్నల్నే మళ్ళీ వేశాడు గణపతి.

"కొట్టారు" అన్నాడు చంటి సంక్షిప్తంగా, తండ్రి వేసిన అన్ని ప్రశ్నలకీ ఒకే జవాబుగా.

"ఆ కొట్టారా? ఎవరూ?" గణపతి అడిగాడు.

"మాస్టారు...శంకరం మాస్టారు"

చంటికి మళ్ళీ ఏడుపు గుర్తు కొచ్చింది.

ఇంట్లో కొచ్చారిద్దరూ.

చంటి ఏడుపు విని, వంట గదిలోంచి బయటికి వచ్చింది నాగమణి... తడి చేతుల్ని పైట కొంగుకి తుడుచుకుంటూ చంటి వంక ఆశ్చర్యంగా చూస్తూ "ఏమ్మా - ఏడుస్తున్నావ్?" చంటి నడిగింది.

"శంకరం మాస్టారు కొట్టాట్ట. పిల్లల్ని చదువు కోసం పంపిస్తామనుకుంటున్నాడో... దెబ్బల కోసం పంపిస్తామనుకుంటున్నాడో ఈ మాస్టారు" కోపంగా అన్నాడు గణపతి.

"మాస్టార్లు ఊరికినే కొడతారా? కొట్టడం వాళ్ళకి సరదానా? వీడు తక్కువ వాడా... ఏదో కోతి పని చేసుకుంటాడు. పిల్లాడిని కొట్టారని మాస్టారిని తప్పు పట్టడం అంత మంచిది కాదనుకుంటాను" అంది నాగమణి.

భార్యకేసి చూశాడు గణపతి. "కన్నవాళ్ళం- మనం ఎప్పుడైనా వాడి మీద దెబ్బ వేశామా? లేదే! పల్లెత్తుమాటన్నామా? లేదే!"

"భయం వుండడానికి అలా ఓ దెబ్బ తగిలించుంటారు? దానికి ఇంతగా ఇదైపోతారేమిటి?" అని చంటిని తీసుకుని పక్క గదిలో కెళ్ళింది నాగమణి.

'ఇదేమిటీ? మాస్టారికి వకాల్తాతీసుకున్న లాయర్‌లా మాట్లాడుతోందీ? వాడు ఏడుస్తోంటే నా గుండె తరుక్కుపోతోంది. చంటి కంట నీరు నేను సహించలేను. వాడి బాధకీ, కంట నీరుకీ కారకుడైన ఆ మాస్టారికి ఓ వార్నింగివ్వాలి. లేకపోతే లాభం లేదు. పిల్లలిచ్చే జీత మ్మీద ఆధారపడి బతికేవాడికి అంత నిక్కు పనికి రాదు' అనుకున్నాడు గణపతి.

అతడికి నెల రోజుల క్రిందటి సంఘటన గుర్తొచ్చింది.

తుపానులో నష్టపోయిన ఆస్తిని అంచనా వెయ్యడానికి ఓ బృందం ఆ ఊరు వచ్చింది. వాళ్ళతో బాటు ఆ ఊరి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రంగారావు కూడా వున్నాడు.

రంగారావు శంకరం మాస్టారికి స్వయానా అన్నగారే!

తన పశువుల పాకకీ, పంట పొలానికీ ఎంతో కొంత నష్ట పరిహారం రాయించుకుందామని, బృందంలో ఓ వ్యక్తికి "పార్టీ" చేశాడు గణపతి.

నిజానికి తుపానులో పైస నష్టపోలేదు గణపతి.

గణపతికి నష్టపరిహారం రాయవద్దని చెప్పాడు రంగారావు.

రంగారావు చేత అలా చేయించిన వాడు, చెప్పించిన వాడూ శంకరం మాస్టారేనని గణపతి అనుమానం. 'అనుమానం కాదు... నిజమే' అని గణపతి ఊహ.

ఆ సంఘటన శంకరం పట్ల గణపతికి ఉన్న కోపాన్ని మరింత పెంచింది.

...చంటిని కొట్టడంతో మూడు రెట్లయింది. సమయం వచ్చింది. చెడామడా, ఎడాపెడా తిట్టేసి కసి నంతటినీ వెళ్ళ గక్కుకునే అవకాశం వచ్చిందని సంతోషించాడు గణపతి.


-ఇక ఆలస్యం చెయ్యదలుచుకోలేదు. ఇలాంటి వ్యవహారాలు ఎంత వీలైతే అంత త్వరగా తేల్చుకోవడం మంచిదని అనుకుని వెంటనే మాస్టారి దగ్గరకి బయల్దేరాడు- చంటిని వెంటేసుకుని.

*   *   *   *

ఆ ఊళ్ళో శంకరం మాస్టారికి మంచి పేరుంది. ఊరందరికీ ఆయనంటే గౌరవం వుంది. శంకరం గారిని ఎరగని వారు ఆ ఊళ్లో లేరంటే అతిశయోక్తి కాదు.

శంకరం మాస్టారి శిష్యరికంలో చదువు బాగా అబ్బుతుందని కొందరు తల్లితండ్రులు గవర్నమెంట్ స్కూల్లోంచి మాన్పించి, శంకరంగారి కాన్వెంట్‌లో వేశారు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్




బెత్తానికి పని చెప్పకుండా విద్యార్థికి ఏ రకంగా చెబితే పాఠం వంట పడుతుందో - ఆ టెక్నిక్ తెలుసున్న తక్కువ మాస్టార్లలో శంకరం గారు కూడా ఒకరు. ఆయన పాఠం చెబుతుంటే పిల్లలు మంత్రించినట్టు వింటారు. మనసుకి హత్తుకునేలా పాఠం చెప్పడం శంకరం మాస్టారి ప్రత్యేకత.

చదువుకోవాలనే ఆసక్తి వున్నవాళ్ళని పరికించి, వాళ్ళలో ఆర్థికంగా వెనకబడ్డ వాళ్ళకి ఫీజుల్లేకుండానే చదువు చెబుతారు. కొందరికి బట్టలు, పుస్తకాలూ కొని ఇస్తారు. డబ్బుకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరాయన, సాధ్యమైనంత మందికి చదువు చెప్పగలిగి- వాళ్ళలోంచి రేపటికి మంచి పౌరుల్ని తన వంతు బాధ్యతగా తయారు చెయ్యాలనేది ఆయన అభిలాష.

గవర్నమెంటు ఉద్యోగం చేద్దామనుకున్నారు. వెనకాల బోలెడు ఆస్తులుండడంతో ఉద్యోగం లేకపోయినా ఫరవాలేదనిపించి- ఉద్యోగం తప్పనిసరి అనుకునే మరో వ్యక్తికి అవకాశం ఇచ్చినట్టవుతుందని ఉద్యోగ ప్రయత్నం విరమించుకుని కాన్వెంటు పెట్టారు. మరో నలుగురికి అందులో ఉద్యోగం కల్పించారు.

*　　*　　*　　*

చంటిని తీసుకుని కాన్వెంట్ దగ్గరకొచ్చాడు గణపతి.

బోయ్ చేత ఆఫీస్ రూమ్‌లోకి కబురు పంపించాడు.

రమ్మని లోపలి నుంచి పిలుపు వచ్చింది.

చంటి, గణపతి లోపలికెళ్ళారు.

శంకరం మాస్టారిని బెదురుగా చూస్తున్నాడు చంటి.

"కూర్చోండి" అన్నారు శంకరం గారు.

"కూర్చోడానికీ నీతో తీరిగ్గా మాట్లాడ్డానికీ రాలేదు. మా చంటిని కొట్టావుట కదా. అంతటి తప్పేం చేశాడు మా వాడు?" కొంచెం కోపాన్ని కంఠానికి మిళితం చేసి అన్నాడు గణపతి.

"విధి నిర్వహణలో అప్పుడప్పుడూ ఒక్కో దెబ్బ పడుతూంటుందండీ. తప్పదు. పిల్లల్ని కొట్టడం మా హాబీ అనుకున్నారా?" శంకరం గారు చిన్నగా నవ్వేరు.

"పిల్లల్ని నీ దగ్గరికి పంపిస్తున్నాం కదా అని నీ ఇష్టం వచ్చినట్టు బాదితే బాగోదు మరి. కొట్టడమే నీ బాధ్యత అనుకుంటున్నట్టున్నావు. ఇంకోసారి ఇలా అయితే..." అని ఆగాడు గణపతి.

గణపతి మాటల్లో 'మర్యాద' లేకపోవడం గమనించకపోలేదు శంకరం గారు.

"అయితే... ఏమవుతుందిట" రెట్టించారు.

గణపతి మాట్లాడలేదు.

"నా కాన్వెంటుకొచ్చి నాకే వార్నింగా? మర్యాద ఇచ్చి పుచ్చుకోవడం నేర్చుకోండి. నా దెబ్బలే కనిపించాయి గానీ మీ అబ్బాయి అల్లరి మీకు కనిపించదు. అయినా చూడండి... మీకు ఇష్టం అయితే మీ అబ్బాయిని వుంచండి. నాకు చేతనైనంత చదువు నేను చెప్తాను. కష్టం అని మీకు అనిపిస్తే మాన్పించెయ్యండి. మీ వాడి వల్ల నాకు ఒరిగేదీ లేదు... మానేస్తే నేను నష్టపోయేదీ లేదు" శంకరం కంఠంలో కోపం తాలూకు జీర.

"నా కాన్వెంట్లో సీటు కోసం జనాలు క్యూలో నిలబడతారు. మీకు తెల్సుగా!"

"అది అలుసుగా చూస్కునే నువ్వు రెచ్చిపోతున్నావు!" అన్నాడు గణపతి.

"మీకూ నాకూ మాటలనవసరం. మీ చంటిని మా కాన్వెంట్లో మాన్పించెయ్యండి" అని లేచారు శంకరం గారు.

గణపతి మూర్ఖుడని ఆయనకి తెలుసు.కానీ ఇంతటి అజ్ఞాని అని ఇప్పుడే తెల్సిందాయనికి.

"మీరు వుంటున్న ఈ ఇంటి ఓనరు నాకు బాగా తెలుసు. మీ చేత దీన్ని ఖాళీ చేయించేస్తాను. ఊళ్ళో ఎక్కడా దొరక్కుండా చేస్తాను" గణపతి ఆవేశంగా అన్నాడు.

"అది మీ వల్ల కాదు. కేవలం మీ చంటి కారణంగా - మిగిలిన - అంటే చదువుకోసం కాన్వెంట్‌కి వచ్చేవాళ్లు నష్టపోవడం నాకు సుతరామూ ఇష్టం లేదు. మీ ఇష్టం వచ్చినట్టు చేస్కోండి" ఇక మరో మాట మాట్లాడ్డం ఆయనకి ఇష్టం లేదు.

"మా అబ్బాయిని మానిపించేస్తాను. సరే. ఇంతవరకూ నేను నీకు కట్టిన ఫీజు వాపస్ ఇచ్చెయ్యండి" అన్నాడు గణపతి.

'ఇదేం మూర్ఖత్వం?'

ఓ ఆయిడియా మెరిసింది.

"ఇంతవరకూ ఏ మాత్రం ఫీజు కట్టి వుంటారు?" గణపతిని అడిగారు శంకరంగారు.


గణపతి చెప్పాడు.

అంత డబ్బూ జేబులోంచి తీసి టేబిల్ మీద పెట్టారు.

అవి తీసుకోబోయాడు గణపతి.

"కానీ ఒక షరతు. మీరిచ్చింది నేను మీకు తిరిగి ఇచ్చేశాను. నేను మీ అబ్బాయికి చెప్పిన చదువుని కూడా నాకు తిరిగి ఇచ్చెయ్యాలి" అన్నారు శంకరం మాస్టారు.

గణపతి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ముఖంలో రంగులు మారాయి. ●



రాజు రాణికి ప్రేమలేఖ రాస్తున్నాడు.

"ఓ రాణీ, నీ ప్రేమ కోసం సప్త సముద్రాలు ఈదుతాను. హిమాలయాలు ఎక్కుతాను అడవిలో బతుకుతాను. నన్ను నమ్ము. నిన్న సాయంత్రం వర్షం పడుతుండడం వల్ల పార్కుకి రాలేదు సారీ."

— గొల్లపూడి శైలజ

2-8-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక